క్లుప్తంగా

శ్మశాన వాటిక అభివృద్ధి పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం తదితరులు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని రామారావు నగర్‌లో శనివారం కార్పొరేటర్ సబిహా బేగం, మేడ్చల్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు మహ్మద్ గౌసుద్దీన్ ముస్లిం శ్మశాన వాటిక అభివృద్ధి పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. రూ. 25 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. బోరు, షెడ్డు, గదుల మరమ్మతులు, కాంపౌండ్ వాల్ పెయింటింగ్, గ్రిల్స్, పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే సహకారంతో జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో వర్కు ఇన్‌స్పెక్టర్ వినాయక్‌రావు, నాగుల సత్యం, వెంకటయ్య యాదవ్, మక్సూద్, ముక్తార్, మన్సూర్, శేషారావు, రాజుచారి, ఖాజా, సాంబశివ, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో జై బాపు, జైభీమ్, జై సంవిధాన్



కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

మోతీనగర్: మూసాపేట డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ గోపిశెట్టి రాఘవేందర్, డివిజన్ అధ్యక్షులు సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ అభ్యాస్ పాదయాత్ర నిర్వహించారు. మోతీనగర్‌లోని పాండురంగ నగర్ నుంచి కబీర్‌నగర్ చౌరస్తా వరకు కార్యక్రమం కొనసాగింది. ముఖ్య అతిథిగా కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఉస్మా షాకీర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నాగిరెడ్డి, తూము వేణు, పుష్పారెడ్డి, సతీష్ రెడ్డి, యాదగిరి, గొట్టిముక్కల వెంకట్, తూము సంతోష్, డివిజన్ అధ్యక్షులు రమేష్ ముదిరాజ్, రమేష్, మల్లికార్జున్, బుచ్చన్న, ప్రకాష్, సుధాకర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు సలీం తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే కృష్ణారావు



మూసాపేట: మూసాపేట జామా మసీదులో నూతనంగా నిర్మించనున్న వజూఖాన పనుల ప్రారంభోత్సవం సందర్భంగా శనివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రార్థనలో ఎమ్మెల్యే కృష్ణారావు పాల్గొన్నారు. కార్యక్రమంలో మసీదు కమిటీ ప్రెసిడెంట్ మహ్మద్, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, హజ్రత్ నమతుల్లా ఖాద్రీ, డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, జిల్లా గోపాల్, షరీఫ్, ఖుర్షీద్, అజీజ్, ఇషాక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల మర్యాద దినోత్సవం



కీ చైన్ అందజేస్తున్న డీఎం హరి, అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత

మూసాపేట: కూకట్‌పల్లిలో ఆర్టీసీ డిపో మేనేజర్ హరి శనివారం బస్సు ప్రయాణికులకు మర్యాద దినోత్సవం నిర్వహించారు. ఉద్యోగులతో కలిసి ప్రయాణికులకు క్యూఆర్ కోడ్, ఆర్టీసీ లోగో ఉన్న కీ చైన్‌ని అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

నేడు ఈస్టర్ ఆరాధన వేడుకలు

నిజాంపేట్: హైదరాబాద్ కల్వరి గ్రేస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఈస్టర్ ఆరాధన వేడుకలు నిర్వహించనున్నట్లు పాస్టర్, సంఘం సభ్యులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని సాయినగర్ (గుట్టమీద), బాచ్‌పల్లి, కూకట్‌పల్లిలో ఎజీఎం ప్రార్థన మందిరంలో జరిగే కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కోరారు. ప్రార్థన అనంతరం విందు ఉన్నట్లు తెలిపారు.

వెల్లువలా దరఖాస్తులు!

రాజీవ్ యువ వికాసం పథకానికి 66,648 దరఖాస్తులు

- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 24,610 యూనిట్ల మంజూరు
- రెండు దశల్లో దరఖాస్తుల పరిశీలనకు యంత్రాంగం కసరత్తు
- జూన్ 2న లబ్ధిదారులకు అర్హత పత్రాలు అందజేసేందుకు చర్యలు



రెండు దశల్లో దరఖాస్తుల పరిశీలన..

సాక్షి, సిటీబ్యూరో: రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తులు వెల్లువెత్తాయి. రాయితీ రుణాల కోసం మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా 66,648 దరఖాస్తులు వచ్చాయి. గడువు పొడిగించాలని పలు విజ్ఞప్తులు వచ్చినా గతంలో ఒకసారి పొడిగించినందున ప్రభుత్వం మరో అవకాశం ఇవ్వలేదు. ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోనూ అవకాశం కల్పించడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ల వారీగా భారీగా దరఖాస్తులు నమోదయ్యాయి. రూ.50 వేల వరకు 100 శాతం రాయితీ ఉండగా.. రూ.50,001 నుంచి రూ.లక్ష వరకు 90 శాతం రాయితీ, 10 శాతం బ్యాంకు రుణం, రూ.1,00,001 నుంచి రూ.2 లక్షల వరకు 80 శాతం రాయితీ, 20 శాతం బ్యాంకు రుణం. రూ.2,00,001 నుంచి రూ.4 లక్షల వరకు 70 శాతం రాయితీ, 30 శాతం బ్యాంకు రుణం అందజేస్తోంది.

రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల్లో అర్హులు, అనర్హులు ఎవరనేది నలుగురు సభ్యులతో కూడిన ప్రత్యేక కమిటీతో విచారణ చేయనున్నారు. గ్రామీణ ప్రాంతంలో ఎంపీడీఓ ఆధ్వర్యంలో పురపాలికల్లో కమిషనర్ ఆధ్వర్యంలో కమిటీ పరిశీలన చేయనుంది. సభ్యులుగా బ్యాంక్ మేనేజర్, ఐకేపీ ఏపీఎం, సంబంధిత కార్పొరేషన్ ఉద్యోగి కమిటీలో ఉంటారు.

◆ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల జనాభా ఆధారంగా యూనిట్లను ఖరారు చేయనున్నారు. మొత్తం యూనిట్లలో 25 శాతం మహిళలకు కేటాయిస్తారు. అందులో ఒంటరి, వితంతు మహిళలకు ప్రాధాన్యం ఉంటుంది. దివ్యాంగులకు మరో 5 శాతం కేటాయిస్తారు.

◆ క్షేత్ర స్థాయిలో విచారణ అనంతరం అర్హులను తేలుస్తారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఆమోదంతో కలెక్టర్ లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం (జూన్ 2న) రుణం మంజూరు పత్రాలను అర్హత పొందిన లబ్ధిదారులకు అందజేయనున్నారు.

ప్రతులు తప్పనిసరిగా..

ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న వారు ఒక ప్రతిని డౌన్‌లోడ్ చేసుకుని సంబంధిత పత్రాలను జతచేసి ఎంపీడీఓ, పురపాలక సంఘాల కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది. చాలామంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని వదిలేశారు.

◆ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న వారిలో 25 శాతం మంది సంబంధిత కార్యాలయాల్లో దరఖాస్తు ప్రతులను అందజేయలేదు. ఆన్‌లైన్ దరఖాస్తు పత్రాలను తప్పనిసరిగా సంబంధిత కార్యాలయాల్లో అందజేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖల జిల్లా అధికారులు కోరుతున్నారు.

శాఖల వారీగా వచ్చిన దరఖాస్తులు ఇలా..

1) బీసీ, ఈబీసీల నుంచి అందిన దరఖాస్తుల సంఖ్య 37,935 , మంజూరైన యూనిట్లు 13,400
2) ఎస్సీల నుంచి అందిన దరఖాస్తుల సంఖ్య 16,300, మంజూరైన యూనిట్లు 6,201
3) ఎస్టీల నుంచి వచ్చిన దరఖాస్తుల సంఖ్య 2,196, మంజూరైన యూనిట్లు 1,594
4) క్రిస్టియన్ మైనార్టీల నుంచి వచ్చిన దరఖాస్తులు 10,217, మంజూరైన యూనిట్లు 3,415

విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిరసన



మూసాపేట: పశ్చిమ బెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ కూకట్‌పల్లి వై జంక్షన్‌లో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భజరంగ్‌దళ్ రాష్ట్ర కో కన్వీనర్ జీవన్ మాట్లాడుతూ.. దాడులు చేసి ఆలయాలను ధ్వంసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీరామ్, సత్యనారాయణ, పావంజి, తిరుపతి, సుదర్శన్, హరి, వినీత్, సాయి, రోహిత్, తేజ, భరత్, కార్తిక్, మురళి, ఉదయ్, మాహేశ్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు వడ్డేపల్లి రాజేశ్వరరావు కోటి విరాళం



జర్నలిస్టులకు చెక్కు అందజేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్, వడ్డేపల్లి రాజేశ్వరరావు

కూకట్‌పల్లి: నిత్యం ప్రజల పక్షాల పోరాటం చేసే జర్నలిస్టులకు బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు అండగా నిలిచారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం శాశ్వత నిధిని ఏర్పాటు చేసుకోవాలని సూచించిన ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని కోటి రూపాయల విరాళాన్ని ప్రకటించారు. శనివారం ఆయన నివాసం వద్ద జరిగిన జన్మదిన వేడుకల్లో రూ.25 లక్షల చెక్కును ఎంపీ ఈటల రాజేందర్ చేతుల మీదుగా జర్నలిస్టులకు అందజేశారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ.. తన సూచన మేరకు కూకట్‌పల్లి సీనియర్ జర్నలిస్టులు అందరూ ఏకతాటిపైకి వచ్చి కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీని ఏర్పాటు చేసుకున్నారని హర్షం వ్యక్తం చేశారు. తాను ఇస్తున్న కోటి రూపాయలను జర్నలిస్టుల శాశ్వత అవసరాలైన భూమి కొనుగోలుకు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు గడ్డమీది బాలరాజు, ప్రధాన కార్యదర్శి దయాసాగర్, కోశాధికారి, కరీం, సీనియర్ జర్నలిస్టులు తొట్ల పరమేష్, నిమ్మల శ్రీనివాస్, విద్యా వెంకట్, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డు ఇవ్వాలి

కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్



వివరాలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

ఓల్డ్ బోయిన్‌పల్లి: నూతన రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన ప్రతి ఒక్కరికి తెల్ల రేషన్ కార్డు ఇవ్వాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని అంజయ్యనగర్ కమ్యూనిటీ హాల్‌లో అధికారులు దరఖాస్తుదారుల వెరిఫికేషన్ ప్రక్రియను ప్రారంభించారు.

బాలానగర్ డిప్యూటీ తహసీల్దార్ శృతిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డీలర్లు నవీన్, అభినవ్, నరేష్, అనిల్, మహేందర్, టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి, గడ్డం నర్సింగ్‌రావు, బుర్రి యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి, సంపత్ పాల్గొన్నారు.

ఉలవచారు రెస్టారెంట్ ప్రారంభం



కూకట్‌పల్లి : నగరంలోని కూకట్‌పల్లి ఉలవచారు రెస్టారెట్ శనివారం ప్రారంభమైంది. ఉలవచారు కేవలం ఆహారం మాత్రమే కాదు,ఆత్మను తాకిన అమ్మ వంటగది అనుభూతి అని ఉలవచారు గ్రూప్స్ వ్యవస్థాపకుడు వినయ్ నరహరి అన్నారు. మన మూలాలు, సంస్కృతి, ఆత్మీయమైన వంటకాల పట్ల ప్రేమతో పుట్టిందన్నారు.

రజతోత్సవ సభకు కదలాలి

బాలానగర్: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పెద్ద ఎత్తున కదలాలని కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ అన్నారు. శనివారం సన్నాహక సమావేశాన్ని ఫతేనగర్ డివిజన్ భగత్‌సింగ్ పార్కులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జన సమీకరణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సభను విజయవంతం చేయాలన్నారు.



బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

ఓల్డ్ బోయిన్‌పల్లి : బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని శనివారం బీఆర్ఎస్ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బడే మజీద్ ప్రాంతంలో వాల్‌పోస్టర్ అతికించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్, నాయకులు సయ్యద్ ఏజాజ్, ఇర్ఫాన్, మేకల హరినాథ్, గడ్డం నర్సింగ్‌రావు, బాల్‌రాజు, మక్కాల సత్యనారాయణ, మట్టి శ్రీను, బుర్రి యాదగిరి, ఇమ్రాన్, సరోజదేవి, సంతోషి, పద్మ, కమల, అశోక్, రాజుగౌడ్, వెంకటేశ్, అజీం, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు దిగే క్రమంలో మహిళకు తీవ్రగాయాలు

బాలానగర్: బస్సు దిగే క్రమంలో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈఘటన శనివారం జరిగింది. చింతల్ నుంచి బాలానగర్‌కు వచ్చేందుకు అనిత (46) మల్లేష్ దంపతులు బస్సులో ప్రయాణించారు. బాలానగర్ చౌరస్తాలో బస్సు దిగే క్రమంలో అనిత కింద పడటంతో ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవర్ అజాగ్రత్తగా బస్సు నడపడం వల్లే గాయాలయ్యాయని అనిత భర్త మల్లేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆమె ప్రస్తుతం సూరారంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. మల్లేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు జన్మదిన వేడుకలు



రాజేశ్వరరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ రాజేందర్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు జన్మదిన వేడుకలను శనివారం ఆయన నివాసం వద్ద అభిమానులు, పార్టీ కార్యకర్తల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొని రాజేశ్వరరావుని సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేయించారు. కూకట్‌పల్లి స్వచ్ఛ భారత్ కన్వీనర్ గురు ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుప్పట్లను జీహెచ్ఎంసీ మహిళా సిబ్బందికి అందజేశారు. అమోర్ ఆసుపత్రి ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య, రక్తదాన శిబిరంలో దాతలను అభినందించారు.

కాట్సన్ మ్యాట్రెస్ కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ

ఆల్విన్‌కాలనీ: సేంద్రీయ సహజ లాటెక్స్‌తో తయారైన కాట్సన్ మ్యాట్రెస్ కరపత్రం, వాల్‌పోస్టర్‌ను శనివారం పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కార్పొరేటర్‌లు నార్నే శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ మ్యాట్రెస్ మోకాళ్ల నొప్పులు, వెన్ను నొప్పిని తగ్గించటంలో సహాయ పడుతుందన్నారు. ఇది ఆరోగ్యకరమైన, సౌకర్యవంతమైన నిద్రను అందించేందుకు రూపొందించబడిందన్నారు. కార్యక్రమంలో నాయకులు రఘునాథ్ రెడ్డి, గణేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

ఐవీఎఫ్, కామారెడ్డి రక్తదాతల సమూహం ఆధ్వర్యంలో



రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన గాంధీ, ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

ఆల్విన్‌కాలనీ: ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ యువజన విభాగం, కామారెడ్డి రక్తదాతల సమూహం ఆధ్వర్యంలో తలసీమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం కూకట్‌పల్లి, మాధవరం నగర్ కమ్యూనిటీ హాలులో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ, ఐవీఎఫ్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా ప్రారంభించి మాట్లాడారు. దేశంలోనే తలసీమియా చిన్నారుల కోసం అత్యధిక యూనిట్లను సేకరించిన సంస్థగా ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్, కామారెడ్డి రక్తదాలత సమూహం ఆవిర్భవించిందన్నారు. నేటి వరకు 2400 యూనిట్ల రక్తాన్ని అందజేసిందని నిర్వాహకులు తెలిపారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసా పత్రాలు, పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో యువజన విభాగం రాష్ట్ర నాయకులు కాపర్తి నాగరాజు, ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు, కార్పొరేటర్ రోజాదేవి, ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు పార్శి ప్రకాష్, యూత్ అధ్యక్షులు కట్ట రవికుమార్, తెరల శ్రీనివాస్, దొంతుల అన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను ఇబ్బంది పెడితే సహించబోం

- ప్రభుత్వ చర్యల వల్లే నీటి కొరత
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: కేసుల పేరుతో ప్రజలను ఇబ్బంది పెడితే సహించబోమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కేపీహెచ్‌బీ డివిజన్‌లో నీటి కొరతతో మోటార్ల ఏర్పాటు చేస్తే అధికారులు తీసుకెళ్తున్నారని ప్రజలు ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో ఆయన శనివారం కేపీహెచ్‌బీ 1వ ఫేజ్, రెండవ లైన్ ధనలక్ష్మి సెంటర్‌వద్ద హెచ్ఐజీ, ఇడబ్ల్యూఎస్ గృహ సముదాయ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సాధారణ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగనివ్వవద్దని అధికారులను కోరారు. 10 ఏళ్ల కాలంలో ఎప్పుడు నీటి కొరత లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్లే నీటి కొరత ఏర్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేపీహెచ్‌బీకి నీటి నిల్వ కోసం లక్షల గ్యాలన్లతో నీటి ట్యాంకులు నిర్మించామని, గతంలో ఎంతో పొదుపుగా నీటిని వాడుకుంటూ ఎక్కడా ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాలనా విధానం తెలియడం లేదని, దీంతో ప్రజలు ఎంతో ఇబ్బంది పడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కో ఆర్డినేటర్ సతీష్ అరోరా, నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి



కార్పొరేటర్‌కు సమస్యను వివరిస్తున్న కాలనీ వాసులు

బాలానగర్: తాగునీటి సమస్యను పరిష్కరించాలని అంబికా కాలనీ వాసులు కోరారు. ఈ మేరకు కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డిని కలిసి శనివారం వినతిపత్రం అందజేశారు. తాగునీటి ప్రెషర్ సమస్య ఎదురవుతుందని, దీంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. అధికారులతో మాట్లాడి సమస్యను త్వరగా పరిష్కరిస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు.

నేరాల అదుపునకు కెమెరాలు దోహదం

నిజాంపేట్: నేరాల అదుపునకు సీసీ కెమెరాలు దోహదపడతాయని బాలానగర్ డీసీపీ కె.సురేష్ కుమార్ అన్నారు. బాచుపల్లిలోని ఏపీ ఆర్ ప్రణవ్ ఆంటీలియా గేటెడ్ కమ్యూనిటీలో శనివారం సాయంత్రం 100 సీసీ కెమెరాలను ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు, బాచుపల్లి సీఐ ఉపేందర్, శ్రీనివాసులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'ఒకే దేశం ఒకే ఎన్నిక' ఎవరు ఆపినా ఆగదు

- ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ న్యాయ నిర్ణేతలు
- ఎంపీ ఈటల రాజేందర్



సదస్సులో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

నిజాంపేట్: దేశంలో ఒకే దేశం, ఒకే ఎన్నిక అవసరమని, ఎవరు ఆపినా అది ఆగేది కాదని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శనివారం నిజాంపేట్‌లోని ప్రగతినగర్ శ్రీకృష్ణగార్డెన్‌లో ఒకే దేశం...ఒకే ఎన్నికపై బీజేపీ కార్యకర్తలకు, నాయకులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల విధానంపై ప్రజలకు వివరించాల్సిన బాధ్యత బీజేపీ శ్రేణులపై ఉందన్నారు. అంబేద్కర్ రిజర్వేషన్లు ఇవ్వడమే కాకుండా దేశానికి ఒక పటిష్టమైన రాజ్యాంగాన్ని అందించారన్నారు. అంబేడ్కర్‌ను అవమానపర్చిన చరిత్ర కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. అందులో జవహర్‌లాల్ నెహ్రూ పాత్ర కూడా ఉందన్నారు. భారతజాతి గర్వించదగ్గ నాయకుడు నరేంద్రమోదీ అని అన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత మోదీకే దక్కుతుందన్నారు. ప్రపంచంలోని ఏ దేశానికైనా తిండి పెట్టగలిగే స్థాయికి భారత్ చేరుకుందని అన్నారు. అహంకారానికి, దోపిడీకి ప్రజలు ఎప్పుడు ఓట్లు వేయరని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కొల్లి మాధవి, జయ, కాంతారావు, నందనం దివాకర్, జిల్లా ఇన్‌చార్జి మల్లారెడ్డి, మండల నాయకులు చౌదరి, బిక్షపతి, ప్రసాద్‌రాజు, డా.రాజు, విజయలక్ష్మి, సుబ్బారావు, గజ్జెలి సంతోష్ పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థుల విజయదుందుభి

ఆల్విన్‌కాలనీ: జేఈఈ మెయిన్స్ 2025 ఫలితాల్లో హైదర్‌నగర్ డివిజన్, నిజాంపేటలోని శ్రీ చైతన్య ప్రతిభ క్యాంపస్, శ్రీ చైతన్య విద్యాసంస్థలలో విద్యార్థులు విజయదుందుభి మోగించారు. శనివారం ప్రకటించిన ఫలితాల్లో శ్రీ చైతన్య ప్రతిభ క్యాంపస్ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబర్చారు. అన్ని కేటగిరీల్లో 10 ర్యాంకులలోగా ఇద్దరు విద్యార్థులు, వెయ్యి లోగా 15 మంది సత్తా చాటారు. ఓపెన్ కేటరిగిలో 1000 లోగా ఏడు ర్యాంకులు, మొత్తం 198 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో కళాశాల నిర్వాహకులు